ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జనగామ

ఆదివారం 21 సెప్టెంబరు 2025

పూల జాతరకు వేళాయె..


జనగామలో పూల అమ్మకాలు

- నేటి నుంచి బతుకమ్మ సంబరాలు
- తొమ్మిదిరోజుల పాటు ఆడిపాడనున్న ఆడపడుచులు
- జిల్లాలో నెలకొన్న పండుగ సందడి
- పూల విక్రయాలతో మార్కెట్లు కిటకిట
- కరువైన తంగేడు పువ్వు
- అమాంతం పెరిగిన పూల ధరలు
- రద్దీగామారిన బస్టాండ్లు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకలకు జనగామ జిల్లా వ్యాప్తంగా మహిళా లోకం సిద్ధమైంది. తొమ్మిది రోజులపాటు సంప్రదాయబద్ధంగా సంబురాలు జరుపుకోనున్నారు. ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ఆరంభం కానున్నాయి. ఆదివారం నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానుండగా పిల్లలు, పెద్దలు, బంధువులు చేసే హడావిడితో గ్రామాలు, పట్టణాలు కోలాహలంగా మారాయి.

మహాలయ అమావాస్యతో ప్రారంభమై...

చేను, చెలకల్లో వాటంతట అవే మొలిచే సహజ పూలనే సేకరించి రంగురంగుల గుండ్రటి ఆకారంలో శిఖరంగా పేర్చడం బతుకమ్మ పండుగకు జీవం. అమావాస్యతో ప్రారంభ


పండుగ సందర్భంగా జనగామ బస్టాండులో రద్దీ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ. బతుకమ్మ అంటే ఆడపడుచులకు కొండంత సంబరం. తొమ్మిది రోజులపాటు ఆడిపాడి సంబరాలు చేసుకుంటారు. నేటినుంచి (ఆదివారం) ఎంగిలిపూల బతుకమ్మతో తొమ్మిదిరోజుల వేడుకలు అట్టహాసంగా ఆరంభంకానున్నాయి. తొమ్మి ది రోజులు తొమ్మిది పేర్లతో ప్రత్యేకంగా బతుకమ్మను కొలువ డం ఆనవాయితీగా వస్తోంది. ఈ వేడుకలకు జిల్లా మహిళాలోకం రెడీ అయ్యింది. చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా బతుకమ్మ పండుగను కన్నులపండువగా జరుపుకోనున్నారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

మయ్యే అశ్వయుజ మాసం బతుకమ్మ సంబురాలకు ప్రత్యేక మాసం. దీనిని మహాలయ అమావాస్య అని పిలుస్తారు. ఈరోజున పితృదేవతల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ బ్రాహ్మణులకు బియ్యం ఇవ్వడం ఆనవాయితీ. అందుకే దీనిని పితృ అమావాస్య అని కూడా అంటారు. అష్టమి వరకు కొనసాగే ఈ పండుగలో కేవలం ఆచారమే కాదు, శాస్త్రీయత కూడా దాగి ఉంటుంది. కొత్త బట్టలు ధరించి ఇత్తడి తాంబాలంలో గుమ్మడి లేదా సొరకాయ ఆకులు పరచి వాటి మీద వరుసలుగా తంగేడు, గునుగు, బంతి, చామంతి, అడవి చామంతి, ముత్యాల పూలు, రుద్రాక్ష పూలు, నీల, గోరింట, పట్టుకుచ్చులు, కట్ల, బీర పూవులతో బతుకమ్మలను పేరుస్తారు. మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి కోరికలు తీరాలని మొక్కుకుంటారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక...

ప్రకృతితో మమేకమై ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలనేదే బతుకమ్మ పండుగ సారాంశం. ఈ పండుగ నాటికి ప్రకృతి అంతా పూలవనంగా మారిపోతుంది. ప్రకృతిలో సేకరించిన పూలను తిరిగి ప్రకృతిలోనే నిమజ్జనం పేరిట కోనేరు లేదా చెరువులు, (మిగతా 8వ పేజీలో)

తొమ్మిది రోజులు.. తొమ్మిది పేర్లతో..

మహిళలు తొమ్మిది రోజుల పా టు ఆడే బతుకమ్మ సంబరాలు ఎంగిలి పూల బతుకమ్మతో ఆరంభమై తొమ్మిదో రోజుల సద్దుల బతుకమ్మతో వేడుక ముగుస్తుంది. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల పేర్లతో బతుకమ్మను కొలుస్తారు. మొదటి రోజు ఎంగిలి పూలల బతుక మ్మ, రెండోరోజు అటుకుల బతుకమ్మ, మూడో రోజు ముద్ద పప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదో రోజు అట్ల బతుకమ్మ, ఆరో అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయ బతుకమ్మ, ఎనిమిదిన వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదిన సద్దుల బతుకమ్మగా కొలుస్తారు.

తొమ్మిది రకాల నైవేద్యాలు..

బతుకమ్మకు తొమ్మిది రోజులు రోజుకోతీరు నైవేద్యం సమర్పిస్తారు. తొలి రోజు పెరుగు అన్నం, రెండో రోజు పులిహోర, మూడో రోజు నిమ్మకాయ అన్నం, నాలుగో రోజు నువ్వులు, చెక్కర, ఐదో రోజు పల్లీలు, బె ల్లం, ఆరో రోజు అలిగిన బతుకమ్మ కావడంతో ఆ రోజు బతుకమ్మ ఆడరు. ఏడో రోజు అటుకులు, చెక్కర, ఎనిమిదిన కొబ్బరిఅన్నం, తొమ్మిదిన బెల్లంతో చేసిన సజ్జముద్దలను నైవేద్యంగా సమర్పిస్తారు.

గౌరమ్మ ఇంకో చరిత్ర..

అమవాస్య రోజున వచ్చే ఎంగిలి పూల బతుకమ్మతో గౌరమ్మ కూడా పుడుతుం దని ఇంకో చరిత్ర చెబుతుంది. పసు పుతో గౌరమ్మను చేసి కుంకుమ బొట్టు పెడతారు.. తొమ్మిదవ రోజయిన అష్టమి నాడు గౌర మ్మను సాగనంపుతారు. ఎంగి లి పూల నాడు పుట్టిన గౌరమ్మను సద్దుల బతుకమ్మ రోజున భక్తి శ్రద్ధలతో పూజించి నిమజ్జనంతో సాగనంపడం ఆనవాయితీగా వస్తుంది.



-రఘునాథపల్లి(ఆంధ్రజ్యోతి)

ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక రూపొందించాలి

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితరాణా


సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక రూపొందించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రాణా ఆదేశించారు. విద్యా వ్యవస్థ పటిష్ఠత కొరకు తీసుకుంటున్న చర్యలపై హైదరాబాద్ నుంచి శనివారం ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో సమీ క్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్, డీఈవో పింకేశ్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటేనే విద్యపై దృష్టి పెడుతారని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణ పనులను పూర్తి చేశామని, ప్రతీ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటుమన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యను అందిస్తున్నామని, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించమని తెలిపారు.

సజావుగా జరుగుతున్న రహదారుల పనులు

జనగామ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల పనులు సజావుగా జరుగుతున్నాయని ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. జాతీయ రహదారుల పనుల ప్రగతిపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు శనివారం జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ పింకేశ్ కుమార్ పాల్గొన్నారు. పింకేశ్ కుమార్ మాట్లాడుతూ దుద్దేడలో 365 బీ జాతీయ రహదారి పనులు సాఫీగా కొనసాగుతున్నయన్నారు. 51శాతం పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనులు సావుగా జరుగుతున్నట్లు తెలిపారు.

పూజా మందిరాల నిర్మాణమెప్పుడు?

- మేడారంలో ఏడాది గడిచినా గుడి పనులకు కలగని మోక్షం
- టెండర్లు ముగిసి నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని నిర్మాణాలు
- మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలంటున్న పూజారులు

వివరాలు 7వ పేజీలో...

పోలీస్ సేవల్లో విశ్వసనీయత ఎంతో అవసరం

- వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్


లింగాలఘణపురం పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

లింగాలఘణపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సేవల్లో విశ్వసనీయత ఎంతో అవసరమని, ప్రతీ ఉద్యోగి విధులను నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజల్లో విశ్వసనీయత సాధ్యపడుతుందని వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. శనివారం లింగాలఘణపురం మండల పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. డీసీపీకి జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ ఘన స్వాగతించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటిన డీసీపీ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి అవసరమైన సూచనలను అందజేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కేవలం సాధారణ పౌరులకు మాత్రమేనని నేరస్థులకు వర్తించదని స్పష్టం చేశారు. న్యాయం కోసం స్టేషన్ మెట్లు ఎక్కే ప్రతీ బాధితుడికి తన పరిధిలో అందించే న్యాయాన్ని అందించనప్పుడే ప్రజల్లో పోలీస్ సేవలపై విశ్వసనీయత పెరుగుతుందన్నారు. విధులు ఎంత ముఖ్యమో వ్యక్తిగత ఆరోగ్యంపై జాగ్రత్త కూడా అంతే ముఖ్యమన్నారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీసీపీ వెంట స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్ శర్మ ఉన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీలు

లింగాలఘణపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): లింగాలఘ ణపురం పీహెచ్‌సీని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యాశాఖాధికారి డాక్టర్ మల్లికార్జున్ రావు ఆకస్మిక తనికీ చేశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న స్వస్త్ నారీ సశక్త పరివార్ అభియాన్‌ను కార్యక్ర మాన్ని పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి రికార్డుల ను తనిఖీ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్ని శాంపిల్స్ సేకరించారని వాటిలో టీడీ హబ్‌కు ఎన్ని పంపించారని వివరాలను తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్ వో డాక్టర్ శ్రీదేవి గైనకాలజిస్ట్ నిపుణుల సేవలను అందించారు. కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు షెడ్యూల్‌ను ప్రకటించి ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలతకు సూచించారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

మళ్లీ మళ్లీ పోటీ చేసేది లేదు..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- గత అసెంబ్లీ ఎన్నికలే నా చివరి ఎన్నికలు
- తప్పు చేయను.. తలదించను..
- ఇప్పటికే రూ.1,025కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టా..
- వచ్చే మూడేళ్లలో సీఎంను ఒప్పించి మరో రూ.2వేల కోట్లు తెస్తా..
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికలే తనకు చివరి ఎన్నికలని, మళ్లీ మళ్లీ పోటీ చేసేది లేదని, ఈవిషయం గతంలోనే చెప్పానని, 21 నెలల పాలనలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి రూ.1025.64 కోట్ల అభివృద్ధి పనులు తీసుకు వచ్చానని, రానున్న మూడేళ్లలో మరో రూ.2000 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో స్టేషన్‌ఘన్‌పూర్, చిలుపూరు, జఫర్‌గడ్ మండలాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.34,03,944 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను కడియం అందించారు. అనంతరం మాట్లాడుతూ 22నెలల పాలనలో తాను తీసుకువచ్చిన పనులకు సంబంధించిన 27 పనులకు సంబంధించిన వివరాలతో కూడిన అభివృద్ధి డాక్యుమెంట్‌ను రూపొదించడం జరిగిందన్నారు. డాక్యుమెంట్‌లో ఏ ఒక్కటైనా తప్పని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తేల్చి చెప్పారు.

ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నా పేద వర్గాలకు సంబంధించిన ఏ సంక్షేమ పథకాలను నిలిపివేయ కుండా అమలు చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తు న్నది రేవంత్ ప్రభుత్వమేనన్నారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉచిత ఆర్టీసీ బస్సు, సన్నబియ్యం పంపిణీ పథకాలను ప్రారంభించిందన్నారు. నియోజకవర్గానికి రూ.15కోట్ల సీసీ రోడ్డు పనులు వచ్చాయని పనులు జరుగుతున్నాయని తెలిపారు. తాను (మిగతా 8లో..)

ఫిరాయింపులు జరగలేదనడం సిగ్గుచేటు


డెవలప్‌మెంట్ స్టేట్‌మెంట్‌ను కాల్చున్న రాజయ్య

- కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది సీఎంకు కనబడడం లేదా
- రూ.1,025 కోట్లతో అభివృద్ధి పనులు అంతా అబద్ధం
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య ధ్వజం
- కడియం విడుదల చేసిన డెవలప్‌మెంట్ స్టేట్‌మెంట్స్ పత్రాల దహనం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేల ఫిరాయింపులు జరగలేదని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి హన్మకొండలో శుక్రవారం మీడియా సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో రూపొందించిన స్టేట్‌మెంట్స్ పత్రాలు చిత్తుకాగితంతో సమానమంటూ వాటిని మీడియా సమావేశంలోనే రాజయ్య కాల్చివేశారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ రూ.1,025 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం చెప్పడం సుద్ధ అబద్ధమన్నారు. 21నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపైన కడియం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నియోజకవర్గానికి వచ్చిన అభివృద్ధి పనులను కడియం బినామీలే చేస్తూ ఆయనకు పర్సంటేజీలు ఇస్తున్నారని, నియోజకవర్గానికి వచ్చిన రూ.30కోట్ల సీసీ రోడ్డు పనులను నాణ్యత లేకుండా బినామీలు చేస్తున్నారని ఆరోపించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే 90శాతం మేర దేవాదుల పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం ఒక్క పైసా కూడా దేవాదులకు ప్రభుత్వం ఖర్చు చేయలేదన్నారు. ఓటు చోరీ నినాదంతో పర్యటిస్తున్న రాహుల్‌గాంధీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఎత్తుకెళ్లిన రేవంత్ రెడ్డి పెద్ద ఓటు దొంగ అని ఆయనపై ముందుగా చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ రాజ్యాంగ బద్ధంగా (మిగతా 8లో..)

జనగామలో మోస్తరు వర్షం


జనగామలో కురుస్తున్న వర్షం

జనగామ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం కొరకు ఎండ తీవ్రతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి మోస్తరు వర్షం కురియడంతో ప్రజలు ఎండ నుంచి ఉపశయనం పొందారు. హైదరాబాద్ రోడ్డు, ఆర్టీసీ చౌరస్తా ప్రధాన రహదారుల వద్ద రోడ్లపై వర్షాపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జనగామ పట్టణంలో 26.3మీమీ, లింగాలఘణపురం 7.0మీమీ పాలకుర్తి మండలం వావిలాల 1.8మీమీ వర్షపాతం నమోదైంది.

బాధ్యతలు స్వీకరించిన సీఐ



జనగామరూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జనగామ సీఐగా సత్యనా రాయణ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐగా పనిచేసిన దామోదర్‌రెడ్డి వరంగల్ వీఆర్‌కు సీపీ అటాచ్ చేయడంతో ఆయన స్థానంలో సత్యనారాయణరెడ్డి బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన సత్యనారాయణరెడ్డి మొదట వాజే డు ఎస్ఐ, తరువాత ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు.



మండల కేంద్రంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఝాన్సీరెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా..

టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

పెద్దవంగర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో దర్శనజు స్వరూప, గంట్లకుంటలో ముక్కవుల మల్లమ్మ, కాన్వాయిగూడెంలో తాండాల మంజుల, కర్ర మురళీధర్‌రెడ్డి, మల్లయ్య, ఐలయ్య, తండాల కళ్యాణి, నర్సమ్మ, కొరిపెల్లిలో ఎర్ర వినయ్, ఎర్ర సోమలక్ష్మి గ్రామాలలో ఇటీవల మరణించగా మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, ఇన్‌చార్జి వియ్‌పాల్‌రెడ్డి, రంగు మురళిగౌడ్, గోపాల్, ముత్యాల పూర్ణచందర్, రవీందర్ రెడ్డి, పొడిశెట్టి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప కుటీర నిర్మాణ పనులకు విరాళం

నర్సింహులపేట,సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప కుటీర నిర్మాణ పనులకు ఇద్దరు భక్తులు 2.75లక్షల విరాళం చెక్కు రూపంలో అందించారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇందిరా గాంధీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రైవేట్ లిమిటెడ్ అధ్యక్షుడు మరియు రాజేంద్రనగర్ అయ్యప్ప స్వామి దేవాలయ కాటేదాన్ ఉపాధ్యక్షుడు సంకూరి జయప్రకాశ్ 2లక్షలు, సీనియర్ పాత్రికేయులు పగిడిమర్రి సూర్యనారయణ75వేలు మొత్తం 2లక్షల75వేల చెక్కులను స్థానికుడు ఎనగండ్ల క్రిష్ణారెడ్డి సమక్షంలో భక్త మండలికి అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులడు జినుకల రమేష్, మాజీ దేవాలయ చైర్మన్ బొల్లం రమేష్, బొల్లం మోహన్‌రావు, ఎనగండ్ల జెన్నయ్య, మొగలగాని యాదగిరి, ఎరనాగి రమేష్ కల్లెడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

పాఠశాలల్లో ఆడిపాడిన విద్యార్థులు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మండలంలోని హరిపిరాల, చెర్లపాలెం తదితర పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూవ్వులు పేర్చి ఘనంగా బతుకమ్మ పాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు తనూజ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వమని మన ఆచార, సంప్రదాయంతో ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు ఆడుకునే పూల పండగ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాకూబ్‌అలీ, జయపాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మల్లయ్య, రాధ, పద్మావతి, రాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.

● చిన్నగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ నెల 21నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక్కచోట చేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

● మరిపెడ(ఆంధ్రజ్యోతి) : ముందస్తు బతుకమ్మ వేడుకలు మరిపెడ మున్సిపాలిటీలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్, మరిపెడ హైస్కూల్, బంగ్లాలోని సీతారాంపూర్ పాఠశాలలో నిర్వహించారు. ఆయా పాఠశాలల టీచర్లు, విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. మరిపెడబంగ్లాలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు బతుకమ్మను వేడుకలు నిర్వహించి, అనంతరం స్థానిక కొండసముద్రం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వేడుకలో డైరెక్టర్లు జర్పుల కాలునాయక్, అఫ్జల్, బెన్నిథామస్, జోసెఫ్, సురేశ్, సనూప్, సుభాన్, రామరావు, అప్సర్, హరిత, వర్షిత, శ్రీలక్ష్మి, ఉమ, మరిపెడ స్కూల్లో హెచ్‌ఎం అనంతరావు, టీచర్లు, బంగ్లా సీతారాంపూర్ పీఎస్ స్కూల్ హెచ్‌ఎం అర్జున్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మలను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్తున్న మరిపెడలోని గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు

'స్వస్థ్ నారీ సశక్త్' తో మహిళలకు మెరుగైన వైద్యం

డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : స్వస్థ్ నారీ -సశక్తి పథకంతో మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తొర్రూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం మరిపెడ పీహెచ్‌సీ లోస్వస్థ్ నారీ -సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా మండలంలోని పలువురి మహిళలకు స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ పార్వతి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరిపెడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవినాయక్, డాక్టర్లు సౌజన్య, వెంకన్న, పూజిత, సీహెచ్‌వో కమల, పీహెచ్ఎన్‌వో మంగమ్మ, సూపర్‌వైజర్లు కృష్ణ, ఆచార్యులు, సుదర్శన్, లక్ష్మీ కుమారి, మాధవి, స్టాఫ్‌నర్స్ సుజాత, రత్నకుమారి, హెల్త్ అసిస్టెంట్ వీరయ్య, ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మరిపెడలో మహిళలకు వైద్య పరీక్షలు జరుపుతున్న డాక్టర్ పార్వతి

● దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి)ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ -సశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి కవిత మాట్లాడుతూ స్త్రీ వైద్యనిపుణురాలు కీర్తి ఆధ్వర్యంలో 57 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంజీవరావు, హెల్త్‌సూపర్‌వైజర్లు మంగమ్మ, సుజాత, భీమానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ఆయుర్వేద సీనియర్ వైద్యుడు డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ఈనెల 23న దేశ వ్యాప్తంగా ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ఆయుర్వేదంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు రామలక్ష్మి, అయేష తదితరులు పాల్గొన్నారు.

కూపన్ల పంపిణీలో సొమ్మసిల్లిన జీపీ కార్యదర్శి

పోలీసుల వాహనంలో ఆసుపత్రికి తరలింపు

దంతాలపల్లి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కూపన్ల పంపిణీ చేస్తున్న రైతు వేదిక భవనంలో ఓ పంచాయతీ కార్యదర్శి సొమ్మసిల్లి నేలపై పడిపోయాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద శనివారం జరిగింది. తెల్లవారు జామునే రైతులు యూరియా కోసం బారులు తీయడంతో అధికారుల సమక్షంలో కూపన్లు పంపిణీ చేస్తున్నారు. ఏఈవోలు దిక్షిత్‌కుమార్, శిరీష పంచాయతీ కార్యదర్శి తాళ్ల అజయ్‌లు ఆర్డర్ ప్రకారం రైతు వేదిక భవనంలో కూపన్లు ఇస్తున్నారు. రైతుల తాకిడి విపరీతంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి అజయ్ తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లిపడిపోయాడు. వెంటనే స్థానిక పోలీసులు వారి వాహనంలో ఆయనను చికిత్స కోసం తొర్రూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వ్యవసాయాధికారి వాహిని తెలిపారు. రైతులు తమకు సహకరించాలని గుంపులు గుంపులుగా రావడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిన్నగూడూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదలకు అపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. ఉగ్గంపల్లికి చెందిన ముత్యం దివ్యకు మంజూరైన రూ. 33వేల సీఎం సహాయనిధి చెక్కును శనివారం లబ్ధిదారుల కుటుంబసభ్యులకు అందజేశారు.

నాన్ టీచింగ్ ఉపాధ్యాయుల

సమస్యలు పరిష్కరించాలి

పెద్దవంగర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. శనివారం మండలంలోని చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలలో ఈనెల 22న స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్‌టీచింగ్ ఉపాధ్యాయులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని వారికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని నాన్ టీచింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఎదుట ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ తొర్రూరు అధ్యక్షుడు ఎండీ షరీఫ్, నాయకులు విజయలక్ష్మి, మమత, పద్మ, మహేశ్వరి, హేమలత, మౌనిక, జ్యోతి, సూజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తొర్రూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాల నిర్వహణలో భాగంగా శనివారం తొర్రూరు బస్టాండ్ ఆవరణలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మోదీ 75 జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా 12కోట్ల మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పల్లె కుమార్, సురేష్, నవీన్, విశాల్, యాకయ్య, రాంబాబు, రవిబాబు, తదితరులు ఉన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్



పాలకుర్తిలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నాయకులు

పాలకుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల కోసం రూ.10వేల కోట్లతో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డుకు రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. అలాగే ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, ఉచిత బస్సు, రైలు ప్రయాణం, హెల్త్‌కార్డులు, సంక్షేమ పథకాలలో 20శాతం కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నందగిరి రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి నలమాస రమేష్, సంగి వెంకన్న, అనుముల అంజీరావు ఉన్నారు.

● జనగామ రూరల్(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(టీయూఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల చైతన్య బస్ యాత్రను చేపట్టగా శనివారం జనగామకు చేరుకుంది. అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉద్యమకారులు నిరసన చేపట్టారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యమకారుల కమిటీని వేసి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, ప్రతీ ఒక్క ఉద్యమకారుడికి 250 గజాల స్థలం పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు, ట్రైన్ పాస్, ఆరోగ్య కార్డులు సంక్షేమ పథకంలో 20శాతం కోటా కేటాయించాలని కోరారు. అక్టోబరు 26 చలో ఇందిరాపార్కును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, కొముత్తం వీరస్వామి, రాజు పాల్గొన్నారు.

రామప్పలో విదేశీయుల సందడి



గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న విదేశీయులు

వెంకటాపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని విదేశీయులు శనివారం సందర్శించారు. హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న ఇరాక్, పాలస్తీనా, ఆర్మేనియా, తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్, శ్రీలంక, వియత్నాం, థాయ్‌లాండ్, ఈజిప్ట్, దక్షిణ సూడాన్, జిబౌటి, ఉగాండా, టాంజానియా, కెన్యా, కోట్‌డి ఐవోయిర్, గాంబియా, లైబీరియా, ఘనా, మొజాంబిక్, జాంబియా, నమీబియా, మారిషస్, క్యూబా, డొమినికన్ రిపబ్లిక్, సురినామ్ తదితర 25 దేశాలకు చెందిన వారు దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ శిల్ప కళా సంపదను పరీక్షించిన విదేశీయులు విశిష్టత, చరిత్రను గైడ్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వారివెంట పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, టూరిజం, పురావస్తుశాఖల సిబ్బంది ఉన్నారు.

వేధింపుల కేసులో యువకుడి రిమాండ్

కొడకండ్ల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వివాహితను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు. జనగామ జిల్లా కొడకండ్ల ఎస్‌ఐ చింత రాజు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొడకండ్ల మండలం పాకాలకు చెందిన యువకుడు రాచకొండ కుమార్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు సంతానం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను కొద్దిరోజులుగా లైంగికంగా వేదిస్తున్నాడు. అతడి వేధింపులు భరించలేక ఈనెల 13న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి కుమార్ పోలీసులను తప్పించుకు తిరుగుతున్నాడు. ఇటీవల మళ్లీ సదరు యువతిని వేధించడంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ దీంతో శనివారం పోలీసులు కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు

లోకాయుక్తను ఆశ్రయించిన మహిళారైతు

బచ్చన్నపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 14 ఏళ్లుగా తాను పట్టాలో ఉండీ కబ్జాలో కొనసాగుతున్న భూమిని ఎలాంటి విచారణ జరపకుండా రెవెన్యూ అధికారులు ఇతరులకు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చి తమకు అన్యాయం చేశారని జనగామ జిల్లా బచచన్నపేట మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన మహిళా రైతు గుర్రాల లలిత నర్సిరెడ్డి లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. రెవెన్యూ అధికారులు తప్పుడు మార్గాల్లో వెళ్తున్నారని, తమ భూమిపై ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.



ఫిర్యాదు పత్రంతో లలిత

మేడారంలో భూసేకరణపై సమావేశం

● స్థానిక గిరిజన రైతులతో ఆర్డీవో చర్చలు

తాడ్వాయి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మల దేవస్థానం అభివృద్ధికి 19.20 ఎకరాల భూసేకరణ కోసం ఆర్డీవో వెంకటేశం ఐటీడీఏ అతిథి గృహంలో స్థానిక రైతులతో శనివారం సమావేశమయ్యారు. భూసేకరణపై వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసియా ఖండంలో పెద్దది అయిన గిరిజన జాతరగా పేరొందిన మేడారం దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎవైనా డిమాండ్లు ఉంటే తెలపాలని, వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. రైతులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ. 20 లక్షలతోపాటు జీవనోపాధికి భూమికి రోడ్డు వెంబడి షాప్ కట్టించి ఇస్తామని అన్నారు. దీంతో కొందరు రైతులు రూ. కోటి చెల్లించాలని కోరారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ అంత మొత్తం ఇవ్వడం కుదరదని, రైతులు సమావేశమై దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తాడ్వాయి ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌బాబు, ఆర్ఐ రాజు. రెవెన్యూ సిబ్బంది, మాజీ సర్పంచ్ చిడం బాబురావు, మేడారం జాతర పంటనష్ట పరిహార సాధన సమితి అధ్యక్షుడు కృష్ణార్జున్ తదిరులు పాల్గొన్నారు.



సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకటేశం

కొనసాగిన ట్రక్ డ్రైవర్ల సమ్మె



విధులను బహిష్కరించిన ట్రక్ డ్రైవర్లు

గణపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్టు-3లో వోల్వో ట్రక్ డ్రైవర్లు రెండో రోజు కూడా విధులను బహిష్కరించారు. తమకు వేతనాలు సరైన సమయంలో ఇవ్వడం లేదని శుక్రవారం ఉదయం సమ్మెకు దిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టు సంస్థ శనివారం సాయంత్రం వేతనాలను చెల్లించింది. అయితే.. సమస్యలు పరిష్కరించేంత వరకు తాము విధులకు హాజరు అయ్యేది లేదని డ్రైవర్లు తేల్చిచెప్పారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని 163వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. రాంపూర్ గ్రామానికి చెందిన రైతు సర్వేశ్వరరావు మిర్చి పంటకు నీళ్లు పెట్టి తిరిగి వస్తుండగా ముల్లేకట్ట గ్రామానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో సర్వేశ్వరరావు కుడి కాలు పూర్తిగా విరిగిపోగా అతడిని వరంగల్‌కు తరలించారు.

విద్యుత్ తీగలు అమర్చిన కేసులో

ఆరుగురి రిమాండ్

మహదేవపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అడవి ప్రాంతం లో విద్యుత్ అమర్చిన కేసులో మండలంలోని మద్దులపల్లి గ్రా మానికి చెందిన ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రి మాండ్‌కు తరలించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామానికి చెందిన చకినారపు సంతోష్, వేల్పుల నాగరాజు, కోర్లశేఖర్, వేల్పుల సురేష్, సకినారపు శ్రీని వాస్, చకినారపు బాపు కొద్ది సంవత్సరాలుగా అడవిలో విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని విక్రయించే వారు. ఈ క్రమంలో గత సంవత్సరం బల్దాపూర్ శివారు అడవి లో మంచిర్యాల జిల్లా కోటపల్లి గ్రామానికి దుర్గం ప్రవీణ్ అనే వ్యక్తి విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. ఈ ఆరుగు రు విద్యుత్ తీగలు అమర్చడమే ప్రవీణ్ మృతికి కారణమైందని గుర్తిం చిన పోలీసులు వారిని అరెస్టు చేశారు. విలేకరుల సమావే శం లో సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్సై తమాష్‌రెడ్డి పాల్గొన్నారు.



వేయిస్తంభాల గుడి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల ఆలయం వద్ద నిర్వహించే రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకల ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం పరిశీలించారు. ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లు, మునిసిపల్, పోలీసు, విద్యుత్, ఇతరశాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేసి ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. బతుకమ్మ ఉత్సవంలో పాల్గొనేందుకు మహిళలు అధికసంఖ్యలో పాల్గొననున్నందున మహిళా పోలీసులు ఎక్కువ సంఖ్యలో బందోబస్తులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, డీసీపీ షేక్ సలీమా, ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఏసీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగి దుర్మరణం

- విద్యుత్ అధికారులపై కేసు

కరీమాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహించి ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందడానికి కారణమైన విద్యుత్ అధికారులపై మిల్స్ కాలనీ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం ఏకే తండాకు చెందిన మూడు సంధ్య కుమారుడు మూడు వినోద్‌తో పాటు తన స్నేహితులైన బానోత్ దేవేందర్, మునావత్ సంతోష్, భూక్య స్వామి బొంపెల్లి సంపత్‌రావు అనే కాంట్రాక్టర్ దగ్గర రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. పనుల్లో భాగంగా ఈ నెల 19వ తేదీన ఉర్సు ప్రాంతంలో మధ్యాహ్నం 12గంటలకు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసే సమయంలో స్థానిక లైన్‌మెన్ కోడం సాంబయ్యను ఎల్‌సీ కోరారు. సాంబయ్య ఎల్‌సీ క్లియర్ కన్‌ఫర్మ్ అని బానోత్ దేవేందర్‌తో చెప్పాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు పనిని ప్రారంభిస్తుండగా విద్యుత్ సరఫరా అవడంతో మూడు వినోద్‌తో పాటు, భూక్యా స్వామి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే వారిని దగ్గర్లో ఉన్న మెడికేర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మూడ్ వినోద్(35) అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రాణాపాయ స్థితిలోఉన్న స్వామిని మరో ఆసుపత్రికి తరలించారు. కాగా ఎల్‌సీ క్లియర్ అంటూ తప్పుడు సమాచారం ఇచ్చిన లైన్‌మెన్ కోడం సాంబయ్యతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏడీ పి.చంద్రమౌళి, ఏఈ దేవరాయ సంపత్, లైన్‌ఇన్‌స్పెక్టర్ భద్రయ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడు వినోద్ తల్లి సంధ్య మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం కేసు నమోదు చేశారు.

ప్రకృతి పండుగకు పూలు కరువు

- కనిపించని తంగేడు, గునుగు పూల చెట్లు
- రసాయనిక మందులు, యంత్రాల వాడకమే కారణం
- మాయమైపోతున్న కంచెలు, బీడు భూములు
- బతుకమ్మ పండుగకు అతివల తిప్పలు
- రోడ్లపై కొనుగోలు చేస్తున్న వైనం
- రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు



తంగేడు పువ్వు



గునుగు పువ్వు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పూజించే సంస్కృతి దేశ వ్యాప్తంగా కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా ఉంటుంది. దానికి నిదర్శనమే బతుకమ్మ పండుగ. ప్రకృతి ప్రసాదించిన పూలను ఎంతో అలంకార ప్రాయంగా పేర్చి, కూర్చి, అందులో పసుపు ముద్దను పెట్టి గౌరమ్మగా భావిస్తారు. వాటికి పూజలు చేయడంతో పాటు మహిళలంతా ఒక్కచోటచేరి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. ఇలాంటి సంస్కృతి దేశంలో మరెక్కడా కనిపించదు. అందుకే బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్ర పండుగగా కీర్తించబడుతోంది. కానీ, అదే ప్రకృతి పండుగకు పూలు కరువవడం ఒకింత బాధపడాల్సిందే.

కనిపించని తంగేడు, గునుగు..

బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. ప్రధానంగా తంగేడు, గునుగు పూలు లేనిది మహిళలు బతుకమ్మను పేర్చరు. ఎంత దూరమైనా, ఎంత ఖర్చయినా సరే తంగేడు, గునుగు పూలు పెట్టి బతుకమ్మను చేయాల్సిందే. ఆ పూలు ఉంటేనే బతుకమ్మకు అలంకారమనేది మహిళల ప్రగాఢ నమ్మకం. అలాంటి పూలు ఇప్పుడు గ్రామాల్లో కనిపించడం లేదు. గతంలో ఎక్కడ పడితే అక్కడ తంగేడు పూలు కనిపించేవి. పంట చేలల్లో, పొలం గట్ల వెంట గునుగు పూల చెట్లు నిగనిగ మెరిసేవి. కానీ, పూలను చూద్దామంటే కూడా కనిపించక పోవడంతో ఇక బతుకమ్మ పండుగకు పూల కరువు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

రసాయనిక మందులు, యంత్రాల వాడకమే..

గతంలో వ్యవసాయాన్ని ఎక్కువగా సేంద్రీయ పద్ధతిలో చేసేవారు. దీనికి తోడు భూమిని దున్నాలంటే నాగళ్లతో పశువుల సహాయంతో దున్నేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి గ్రామాల్లో ఎక్కడా కనిపించడం లేదు. సేంద్రీయ వ్యవసాయం పక్కన పెట్టి ఇష్టానుసారంగా రసాయన మందుల వాడడంతో ప్రకృతి సిద్ధంగా పెరిగే తంగేడు, గునుగు పూల మొక్కలు కనిపించడం లేదు. దీనికి తోడు ఎక్కువగా గడ్డి మందును వాడడం సైతం ఈ మొక్కల పెరుగుదలకు ఆటంకం కలుగుతోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. పొలంలో, పొలం గట్ల వెంట, చేనుల్లో పెరిగే కొన్ని మొక్కలు సైతం యంత్రాల సహాయంతో దున్నడంతో భూమిలో కలిసిపోతున్నాయి. తద్వారా తంగేడు, గునుగు పూల చెట్లు కనుమరుగవుతున్నాయి.

రంగులద్ది అమ్ముతున్న వ్యాపారులు..

తంగేడు, గునుగు పూలు లభించక పోవడంతో కొంత మంది వీటిని రోడ్లపైకి తీసుకువచ్చి ప్రజలకు అమ్మకాలు జరుపుతున్నారు. వీటికి తోడు గునుగు పూలకు ఏకంగా రంగులద్ది అమ్ముతున్నారు. కట్టలుగా కట్టి తంగేడు, గునుగుతో పాటు బంతి, చామంతి, మందార లాంటి ఇతర పూలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం బంతి పూలు కిలో రూ.150 ఉండగా, చామంతి పూలు రూ.400 వరకు పలుకుతున్నాయి. వీటికి తోడు తంగేడు కట్ట రూ.50 కాగా, గునుగు పూల కట్టకు రంగులద్ది ఇస్తే రూ.100 వరకు తీసుకుంటున్నారు.

మాయమైపోతున్న కంచెలు..

ఒకప్పుడు ప్రతి గ్రామంలోసైతం ఊరి చివరన కంచెలు ఉండేవి. వాటికి తోడు బీడు భూములు సైతం కనిపించేవి. వాటిల్లో తంగేడు, గునుగు పూల చెట్లు ఎక్కువగా పెరిగేవి. దాదాపు ఊరంతటికి సరిపోయేంత పూలు లభించేవి. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. జనాభా పెరుగుతుండడంతో కొద్ది భూములు సైతం సాగులోకి వచ్చేస్తున్నాయి. కంచెలు, బీడు భూములు ఏమున్నా మనిషి ఆధునిక పరికరాలతో సాగులోకి తెచ్చేస్తున్నాడు. తద్వారా పూల మొక్కలు కనుమరుగవుతున్నాయి. ప్రస్తుతం రోడ్లు, చెరువులు, కుంటల వెంట కొన్ని తంగేడు చెట్లు పెరగడంతో కొంతమందికి మాత్రమే పూలు లభిస్తున్నాయి. వాటిని కూడా కొందరు తెంపుకుని నగరాలకు తరలించి అమ్మేసుకుంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత వాసులు కూడా రోడ్లపైకి వచ్చి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

ఓ-పాజిటివ్‌కు బదులు బి-పాజిటివ్..

- రక్తం ఎక్కించడంలో వైద్య సిబ్బంది తప్పిదం
- రోగి పరిస్థితి విషమం.. ఎంజీఎంలో కలకలం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగులపై మరోసారి నిర్లక్ష్యం బయటపడింది. ఒక గ్రూపు రక్తం బదులు మరో గ్రూప్ రక్తాన్ని రోగికి ఎక్కించారు. రోగి ఆరోగ్యం విషమంగా మారడంతో గుట్టుచప్పుడు కాకుండా రోగికి చికిత్స అందిస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలోని ఫీమేల్ మెడికల్ వార్డులో జ్యోతి అనే రోగికి ఓ-పాజిటివ్ బ్లడ్‌కు బదులుగా బి-పాజిటివ్ బ్లడ్ ఎక్కించారు. రోగి వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. సీనియర్ వైద్యులు రంగంలోకి దిగి ఎందుకు ఇలా జరిగిందని ఆరా తీయగా.. మరో బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించారని వెల్లడైంది. వెంటనే వైద్యులు గుట్టుచప్పుడు కాకుండా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం జ్యోతి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రోగి బంధువులు వైద్యులపై మండిపడుతున్నారు.

విచారణకు ఆదేశం

ఎంజీఎం ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌పై విచారణకు ఆదేశించినట్లు ఎంజీఎం ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి తెలిపారు. రక్తం గ్రూప్ మారడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. రోగి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. విచారణ కమిటీ నివేదిక అందగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

‘దసరా ఉత్సవం’పై ముదురుతున్న వివాదం

- డోలాయమానంలో కాశిబుగ్గ సమితి
- ఎక్కడ, ఎలా నిర్వహించాలనే విషయమై మల్లగుల్లాలు
- ఉత్సవాలను తామే నిర్వహిస్తామంటున్న 14వ డివిజన్ నాయకులు
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ప్రోత్సాహంతో ముందుకు...



ఏనుమాముల మార్కెట్‌లో సమావేశమైన అన్ని పార్టీల నాయకులు

వరంగల్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల పాటు వైభవంగా దసరా ఉత్సవాలను నిర్వహించిన కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకుల పరిస్థితి ప్రస్తుతం ‘ముందు నుయ్యి.. వెనుక గొయ్యి’ అన్న చందంగా తయారైంది. ‘కాశిబుగ్గ దసరాతో కొత్త చిక్కు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురించిన కథనంతో శనివారం వారు అత్యవసరంగా సమావేశమయ్యారు. 14వ డివిజన్‌కు చెందిన అన్నిపార్టీల నాయకులు ‘మా డివిజన్‌లో మేమే దసరా ఉత్సవాలను నిర్వహించుకుంటాం’ అంటూ తీర్మానం చేసుకున్నారు. దీంతో కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ఏం చేయాలో తెలియని స్థితిలో పడిపోయింది. వారు కూడా వెంటనే సమావేశమై పరిస్థితిని సమీక్షించుకున్నారు. ఇప్పటికే చందాల విషయంలో అనేక ఆరోపణలు రావడం, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఈ విషయంలో మందలించడంతో ఉత్సవాలు నిర్వహిద్దామా.. వద్దా.. అని చర్చించారు. చివరికి కొన్ని ప్రతిపాదనలతో ముందుకు సాగాలని తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది.

14వ డివిజన్‌కు చెందిన నాయకులతో మాట్లాడి ఉమ్మడిగా ఉత్సవాలను నిర్వహించుకునేలా ఒప్పించాలని, ఉత్సవాలు జరిగే స్థలం 14వ డివిజన్ కాదు, 20వ డివిజన్ కిందకే వస్తుందని చెప్పాలని, వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, కొండా సురేఖ, మురళీధర్‌రావులను కలిసి ఉత్సవాలు నిర్వహించుకునేలా సహకరించాలని కోరాలని, గతంలో మాదిరిగా ‘కుడా’ పర్మిషన్ తీసుకుని ఓసిటీ స్టేడియంలో ఉత్సవాలు నిర్వహించాలని, లేదంటే దసరా ఉత్సవాలను 14వ డివిజన్ వారికి అప్పజెప్పాలని.. ఇలా అనేక అంశాలపై చర్చించినట్టు తెలిసింది. అలాగే దసరా పరపతి సంఘం సమావేశం ఏర్పాటుచేసి డబ్బుల లెక్కలు తీసి క్లియర్ చేయాలనే అంశంపైనా చర్చించినట్టు సమాచారం.

మా ఏరియాలో మీ పెత్తనమేంటి?

“మా నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి?” అంటూ కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకుడికి శనివారం వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఫోన్‌చేసి మందలించినట్లు తెలిసింది. మీ పరిధిలో మీరుండాలని, అంతకుమించి పోవద్దని సూచించినట్లు తెలిసింది. మరోవైపు 14వడివిజన్ నాయకులతో మాట్లాడి కొత్తగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. దీంతో అన్ని పార్టీల నాయకులతో ఉత్సవాలను నిర్వహించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది.

ఉత్సవాలను మేమే నిర్వహించుకుంటాం..

‘దసరాతో కొత్త చిక్కు’ అన్న శీర్షికతో ‘ఆంధ్రజ్యోతి’ ప్రచురించిన కథనంతో 14వ డివిజన్ నాయకులు ఆలోచనలో పడ్డారు. వెంటనే అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య అధ్యక్షత వహించారు. “మన డివిజన్ పరిధిలో జరుగుతున్న ఉత్సవాలకు మనల్ని ఆహ్వానించకుండా, మన ప్రమేయం లేకుండానే కాశిబుగ్గ దసరా కమిటీ ఉత్సవాలు నిర్వహించడం సరికాదు..’ అంటూ ఖండించారు. ఏర్పాట్లన్నీ ప్రభుత్వ శాఖలే నిర్వహిస్తుండగా ఒక బొమ్మ మాత్రమే దసరా ఉత్సవ సమితి వాళ్లు ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని, వాటిని మనమే ఘనంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు శాసనసభ్యుడు నాగరాజును కలిసి ఏర్పాట్లు చేయించాలని కోరాలని నిర్ణయించారు.



అత్యవసర సమావేశంలో పాల్గొన్న కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి నాయకులు

అన్నంత పని చేశాడు..

- మరణాన్ని కావాలనే ఆహ్వానించాడు..
- సురేందర్ ఆత్మహత్యతో రాంనగర్‌లో విషాదం
- స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబసభ్యులు

ఐనవోలు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా మానసిక వ్యథతో బాధపడుతూ అన్నంత పనిచేశాడు.. చావాలనిపిస్తోందని తనువు చాలించాడు. బీటీ నగర్‌లో ఆత్మహత్య చేసుకున్న బ్యాంక్ ఉద్యోగి ఉదంతం స్వస్థలం రాంగనర్‌లో కుటుంబసభ్యులు, బంధుమిత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఐనవోలు మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన బర్ల సోమయ్య - ఐలమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సురేందర్, నాగరాజు, కూతురు లత ఉన్నారు. తండ్రి గతంలోనే చనిపోయాడు. బీద కుటుంబమైనప్పటికీ ఇద్దరు కుమారులు కష్టపడి ఉన్నత చదువులు చదివి బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. బర్ల సురేందర్(36) ఎంటెక్ విద్యను అభ్యసించాడు. కొన్నేళ్లుగా హెచ్‌డీఎఫ్‌సీలాంటి బ్యాంకుల్లో ఉద్యోగం చేశాడు. నెల కిందట నుంచి ఐసీఐసీఐ హైదరాబాద్ హైటెక్ సిటీ మాదాపూర్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామంతాపూర్‌లో నివాసముంటున్న అతడికి భార్య సంధ్యరాణి, కుమారుడు సాకేత్ ఉన్నారు. అతడు శుక్రవారం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి బీటీనగర్ చెరువు కట్టపైకి వెళ్లాడు. తనను చావు పిలుస్తోందని కుటుంబసభ్యులకు వాట్సాప్ మేసేజ్ చేసి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం మృతదేహాన్ని గుర్తించి వెలికితీసి స్వగ్రామానికి తీసుకవచ్చి అంత్రక్రియలు నిర్వహించారు. అయితే అతడి మరణం అందరినీ ఆందోళనకు గురిచేసింది. తనకు మరణం తప్పదని కొంతకాలంగా కుటుంబసభ్యులు, బంధుమిత్రుల దృష్టికి తీసుకవచ్చినప్పటికీ ఆత్మహత్య వేదన అతడి మనుసును వీడలేదు.



సురేందర్(ఫైల్)

మానసిక వైద్యుడిని సంప్రదిస్తే బతికేవాడు..

సురేందర్ కొన్ని రోజులుగా చావాలనిపిస్తోందని కుటుంబసభ్యులకు చెబితే అతడికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఉద్యోగంలో ఏమైనా ఇబ్బంది ఉందా?, ఆర్థిక సమస్యలు, కుటుంబసమస్యలు ఏమైనా ఇబ్బందిపెడుతున్నాయా? అని కుటుంసభ్యులు అడిగి తెలుసుకున్నారు. తనకు కుటుంబం, ఆర్థిక సమస్యలు లేవని చెప్పుతూనే కొత్త ఉద్యోగం చేయలేకపోతున్నానని ఒక మాట చెప్పాడట. ఉద్యోగం మానేసి పాత ఉద్యోగం చేయమని సలహాలు ఇచ్చారు తప్ప.. చనిపోయే ఆలోచన ఎందుకు వస్తోందని మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లలేదు. మానసిక వైద్యుడి దగ్గరకు తీసుకెళితే చావు తప్పేదని అతడి అంత్రక్రియల్లో పాల్గొన్న స్థానికులు, విద్యావంతులు విచారం వ్యక్తం చేశారు.

దామెర చెరువు అభివృద్ధికి చర్యలు

- అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు
- నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్

కరీమాబాద్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ మండలంలోని జక్కలొద్ది సమీపంలో ఉన్న దామెర చెరువు పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్ తెలిపారు. ‘దామెర చెరువుపై నిర్లక్ష్యమేల?’ అనే శీర్షికతో శుక్రవారం ‘ఆంధ్రజ్యోతి’ జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. పని చేయని తూములు, కుంగిన కట్ట, రెండు వైపులా పెరిగిన చెట్లు, నీటి పారకం కాల్వల దుస్థితి.. ఇలా చెరువు వద్ద నెలకొన్న దుస్థితిని కథనం కళ్లకు కట్టింది. ఈ నేపథ్యంలో ఈఈ కిరణ్‌కుమార్, డీఈ మధుసూదన్‌రెడ్డి శనివారం చెరువును సందర్శించారు. స్థానిక రైతు ప్రతినిధులతో కలిసి దాదాపు రెండు గంటలపాటు చెరువు సమస్యలను పరిశీలించారు. పాడైపోయిన రెండు తూములను స్వయంగా చూశారు. పలుచోట్ల కోతకు గురై కుంగిన కట్టను పరిశీలించారు. కట్టపైన పెద్దఎత్తున మొలిచిన చెట్లు, పొదలను తిలకించారు. రైతులతో కలిసి కట్టపైన అతికష్టమ్మీద నడిచారు. చెరువు వద్దకు వెళ్లే దారి బురదమయం కాగా, మసీదు బండ నుంచి కట్ట వరకు స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులు చెరువు సమస్యలను ఏకరువు పెట్టారు. ఇరిగేషన్ అధికారులు గత పదేళ్లగా చెరువు నిర్వహణను పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తూములు తెరుచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇప్పటికే చెరువు నిండు కుండలా మారిందని, ఇంకా వర్షాలు పడుతున్నందున కట్టకు గండి పడితే రైతులకు, నగర వాసులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. వెంటనే మరమ్మతులతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

రైతుల గోడును సావధానంగా విన్న అనంతరం ఈఈ తోట కిరణ్‌కుమార్ స్పందిస్తూ.. దామెర చెరువు అభివృద్ధి పనులకు రూ.2.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని తెలిపారు. చెరువు పరిస్థితిపై వరంగల్ నిట్ నిపుణులతో అధ్యయనం చేయించామని, వారు ఇచ్చిన నివేదిక ఆధారంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. మత్స్యశాఖ నుంచి ఈత నిపుణులను పిలిపించి తక్షణ చర్యగా తూముల పునరుద్ధరణ చేస్తామని తెలిపారు. అలాగే గట్టమ్మనుంచి చెరువుకట్ట వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు శెంకేశి శ్రీనివాస మూర్తి, స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేర్ల అనిల్‌కుమార్, స్థానిక రైతులు శెంకేశి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ మూర్తి, సుధాకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దామెర చెరువు దుస్థితిని వెలుగులోకి తీసుకువచ్చిన ‘ఆంధ్రజ్యోతి’కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



దామెర చెరువు కట్టను పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ ఈఈ తోట కిరణ్‌కుమార్‌తో స్థానిక రైతులు

పూజా మందిరాల నిర్మాణమెప్పుడు?

- మేడారంలో ఏడాది గడిచినా గుడి పనులకు కలగని మోక్షం
- టెండర్లు ముగిసి నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని నిర్మాణాలు
- మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలంటున్న పూజారులు




మేడారంలో సమ్మక్క పూజా మందిరం

తాడ్వాయి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఇలవేల్పుల పూజా మందిరాల నిర్మాణానికి నేటికి మోక్షం కలగడం లేదు. భక్తుల కల్పవల్లులుగా పేరొందిన ఆ తల్లుల గుడులు కట్టడంలో ఎందుకు ఇంత జాప్యం చేస్తున్నారని పలువురు పూజారులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మక్క, సారలమ్మ గుడుల శాశ్వత నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం ఇంత వరకూ ప్రారంభం కాకపోవడం శోచనీయం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మల పూజా మందిరాల ఆధునీకరణ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.1.80 కోట్లు మంజూరు చేసింది.

2024 సెప్టెంబరు నెలలో ప్రణాళికలు రూపొందించి శిథిలావస్థలో ఉన్న మేడారం గ్రామంలో ఉన్న సమ్మక్క గుడికి రూ.90లక్షలు, కన్నెపల్లి గ్రామంలో ఉన్న సారలమ్మ గుడికి రూ.90 లక్షల నిధులతో శాశ్వత ప్రాతిపదికన రాతి కట్టడాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుత్తేదారులను పిలిచి టెండర్లు తీసుకున్నారు. ఈ క్రమంలో మినీ జాతర, ఎమ్మెల్సీ ఎన్నికలు అడ్డు రావడంతో పనులు వాయిదా పడ్డాయి. మార్చిలో తిరిగి టెండర్లను అధికారులు విప్పి సదరు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కాగా పనులు నేటికి ప్రారంభానికి నోచుకోక పోవడంతో పూజారుల్లో అసంతృప్తి నెలకొంది. వర్షాకాలం గుడులు కురుస్తున్నాయని పూజారులు అంటున్నారు. వన దేవతల పూజా మందిరాల నిర్మాణ పనులు ప్రారంభమై మహా జాతర వరకు పూర్తవుతాయన్న పూజారుల ఆశలు ఆవిరయ్యేట్లు ఉన్నాయి.

కాంట్రాక్టర్ తీరుపై విమర్శలు..

ఏడాది గడుస్తున్నా మేడారం సమ్మక్క, సారలమ్మల మందిర నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు గుడుల నిర్మాణానికి కాంట్రాక్టర్ సముఖంగా ఉన్నాడా...? లేదా అనే చర్చ జరుగుతోంది. మేడారం దేవస్థానం గత కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపినట్లు సమాచారం. అయినప్పటికీ స్పందించక పోవడం గమనార్హం. అధికారులు ఈ టెండర్‌ను రద్దు చేసి మరలా రీ టెండర్ వేస్తారా...? అనే అనుమానాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా పూజారులు కాంట్రాక్టర్‌ను మార్చి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు. మాస్టర్ ప్లాన్ కంటే ముందు పనులను అధికారులు కుంటుపడేశారని, పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని పూజారులు అంటున్నారు. ప్రణాళికలు రూపొందించిన నాటి నుంచి సమ్మక్క, సారలమ్మ గుడులపై అధికారులు చిన్నచూపుగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. గతంలో మినీ జాతర అడ్డు వస్తే ఈ సారి మహా జాతర అడ్డు వస్తుందా...! అని మాట్లాడుతున్నారు. వెంటనే పనులు చేపట్టాలని పూజారులు కోరుతున్నారు.



ఆర్కిటెక్చర్లు రూపొందించిన మందిరాల డిజైన్



కన్నెపల్లిలో సారలమ్మ పూజా మందిరం

గుడి కురుస్తోంది..

- సిద్ధబోయిన మునీందర్, ప్రధాన పూజారి

వర్షం కురిస్తే సమ్మక్క గుడి కురుస్తోంది పునర్నిర్మాణం జరుగుతుందని ఆశ పడ్డాం. గుడి అభివృద్ధి జరగాలని గట్టి కోరిక ఉంది. దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కార్యనిర్వహణ అధికారి మారి పనులు కుంటుపడ్డాయి. పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దృష్టి సారించి గద్దెల అభివృద్ధితో పాటుగా మేడారంలో ఉన్న సమ్మక్క గుడి, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మల పూజా మందిరాలను అభివృద్ధి చేయాలి.

చికిత్స పొందుతూ మృతి

పాలకుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దర్దెపల్లి శివారు గూడోల్ల గూడెంలో శనివారం జరిగింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ కథనం ప్రకారం. గూడోల్లగూడెంకు చెందిన ముస్కు ఎల్లయ్య (54) ఈనెల 9న తన వ్యవసాయ పనుల్లో నిమగ్నమవగా పాము కాటు వేసింది. దీంతో ఇంటికి వెళ్లి చికిత్స కోసం స్థానిక ఆస్పత్రికి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎల్లయ్య కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు,ఇద్దరుకుమార్తెలు ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

నర్మెట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. చిలుపూర్ మండలం శ్రీపతిపల్లికి చెందిన వంగ రవీందర్ తన స్కూటీపై నర్మెటకు వస్తుండగా, తరిగొప్పుల వైపు టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్న వ్యక్తులు ఎదురుగా వచ్చి ఢీ కొట్టారు. దీంతో రవీందర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై నగేష్ 108కు సమాచారం అందించారు. వారు జనగామ ఏరియాఆస్పత్రికితరలించారు.

క్షతగాత్రుడికి రోడ్డుపైనే శస్త్రచికిత్స



లింగాలఘణపురం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి పై శనివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో పాలకుర్తి మండలానికి చెందిన వైట్ల రాజుగా యాల పాలయ్యాడు. అదేసమయంలో అటుగా వస్తున్న ఆయుష్మాన్ హాస్పిటల్ వైద్యులు అభిలాష్ సీఎస్, మాచర్ల భిక్షపతి ఆగి తమ కారులోని ఫస్ట్ ఎయిడ్ సర్జికల్ కిట్‌ను ఉపయోగించి, రోడ్డుపైనే కూర్చోబెట్టి తలకు కుట్లు వేశారు. రాజుకు ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో వైద్యులు తిరిగి ఇంటికి పంపించారు.

సీఐ దామోదర్‌రెడ్డిని సత్కరించిన నాయకులు



సీఐని సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జనగామ సీఐగా విధులు నిర్వర్తించిన దామోదర్‌రెడ్డిని వరంగల్ వీఆర్‌కు శుక్రవారం వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ బదిలీ చేశారు. శనివారం సీపీఎం నాయకులు సీఐ దామోదర్‌రెడ్డిని శాలువతో సత్కరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ దామోదర్‌రెడ్డి విధులు సమర్థవతంగా నిర్వహించి జనగామలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బొట్ల శేఖర్, గోపి, విజేందర్, పొత్కనూరి ఉపేందర్, ధర్మభిక్షం తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దంత వైద్యశాల వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉచిత దంత వైద్య పరీక్షా శిబిరాలను వినియోగించుకోవాలని డాక్టర్ అంబటి కార్తీక్ రాజు కోరారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడారు. శనివారం నుంచి అక్టోబరు 5 వరకు ఈ శిబిరాలు స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, ఆలేరులోని డాక్టర్ కార్తీక్ డెంటల్ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

లంబాడీలపై నీచంగా మాట్లాడటం సిగ్గుచేటు

కొడకండ్ల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): లంబాడీ జాతీపై నీచంగా మాట్లాడటం సిగ్గు చేటని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ గాంధీనాయక్ శనివారం ఒక ప్రకటనలో అన్నారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన సోయం బాబూరావు, తెల్లం వెంకట్రావుకు మద్దతుగా డాక్టర్ రామచంద్రు నాయక్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు.



జనగామలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో..



జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ..



జనగామలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో..



దేవరుప్పుల బాలయేసు పాఠశాలలో..



జనగామ సెయింట్ పాల్స్ స్కూల్‌లో..

ఘనంగా బతుకమ్మ వేడుకలు

● ఆడిపాడిన విద్యార్థినులు
● పాఠశాలల్లో సందడి



జఫర్‌గడ్ మండలం కూనూరు హైస్కూల్‌లో

జనగామ కల్చరల్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జనగామ జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పాఠశాలలకు 21 నుంచి పండుగ సెలవులు ప్రకటించడంతో సంబరాలు జరుపుకున్నారు. బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తువుల్లో విద్యార్థినులు మెరిసిపోయారు. పలు పాఠశాలల్లో డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో డైరెక్టర్లు తుమ్మ శ్రీలత రెడ్డి, ఉదయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ ఆధ్వర్యంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో అలరించారు. ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో డైరెక్టర్ చిర్ర ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎస్‌పీఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ కీర్తి వీరేందర్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అలాగే సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మరియ జోసెఫ్ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిపారు. అలాగే దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జేసురాజు ఆధ్వర్యంలో దేవరుప్పుల కూడలిలో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు.



కంచనపలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో



బొమ్మకూరులో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



లింగాలఘణపురం కేజీబీవీలో

ఫిరాయింపులు జరగలేదనడం సిగ్గుచేటు

(5వ పేజీ తరువాయి)

వ్యవహరించకుంటే స్పీకర్ విషయాన్ని న్యాయస్థానంలో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. కడియంకు రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం వర్గీయులు తనను కించపరిచేలా, వ్యక్తిగత ప్రతిష్ఠకు ఇబ్బంది కలిగేలా ప్రదర్శనలు చేశారని, సంబంధిత క్లిప్పింగ్‌లు ఉన్నాయని వారి పైన పరువునష్టం దావా కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసును పెట్టవచ్చు కాని అలా చేయడం లేదన్నారు. కార్యక్రమంలో జడ్పీ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ మారపాక రవి, నాయకులు మాచర్ల గణేష్, ఆకుల కుమార్, పసునూరి మహేందర్ రెడ్డి, జనగాం యాదగిరి, కేశిరెడ్డి రాకేష్ రెడ్డి, భాగ్యలక్ష్మి, తాటికొండ సురేష్, ఒగ్గు రాజు, గుండె మల్లేషం, బత్తుల రాజన్‌బాబు, గొడుగు సంజీవ, ప్రసాద్, అశోక్, నారగోని రాజు, కుంభం కుమార్ పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ పోటీ చేసేది లేదు..

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గఅభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని, ప్రతిపక్షంలో ఎమ్మెల్యేగా ఉంటే ఏమీపని చేయలేనని, దీంతో నియోజకవర్గం నష్టపోతుందని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డికి తన పైన ఉన్న అభిమానంతో నియోజకవర్గానికి 21నెలల కాలంలో రూ.1025.64 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాజకీయం కొరకు సిద్ధాంతపరంగా మాట్లాడండి, వ్యక్తిగతంగా దూషణలకు, కుటుంబ సభ్యులను వదిలి పెట్టకుండా నీచస్థాయికి వెళ్లి మాట్లాడడం మంచిదేనా అని ప్రశ్నించారు.

తప్పు చేయను... తలదించను...

తప్పుచేయను తల వంచను, చిలిపి చేష్టలు లేవు.. చిల్లర పనులు చేయను, ఎవరింటికైనా వెళ్తే నాటుకోడి కోస్తావా అని అడిగేది లేదని కడియం శ్రీహరి పేర్కొన్నారు. బ్లాక్ లేబుల్ పెడుతావా అని అడిగేది లేదు, మిగిలింది నా టిఫిన్ బాక్స్‌లో పెడుతావా అని అడిగేది లేదు అంటూ వెల్లడించారు. ఒకప్పుడు ఘన్‌పూర్ పేరు చెప్పుకోవడానికి సిగ్గుపడేది, ఇవ్వాల ఘన్‌పూర్ అంటే అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంగా పేరు తెచ్చుకుంటున్నామని తెలిపారు. వంద పడక ఆస్పత్రి, రెవెన్యూ డివిజన్ కాంప్లెక్స్ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ కళ్లముందు కనబడుతున్నా, ఏమీ జరగడం లేదని మాట్లాడే వాళ్లు మనుషులు అయితే చెప్పవచ్చు కాని పశువు లక్షణాలు ఉన్న వాళ్లకి ఏమి చెప్పగలం అంటూ విమర్శించారు.

కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్య రెడ్డి, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏవో చంద్రన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పుస్తకాంజలి'కి పుస్తకాల అందజేత



హైస్కూల్ లైబ్రరీకి అందించిన పుస్తకాలు చూపుతున్న టీచర్లు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన రిటైర్డ్ పాలిటెక్నిక్ ప్రొఫెసర్ చింతకుంట్ల సంపత్‌రెడ్డి రూ.10వేలతో పిల్లలకు అవసరమైన 190 కథల పుస్తకాలు శివునిపల్లి హైస్కూల్‌కు అందించారు. పుస్తకాంజలి కార్యక్రమంలో భాగంగా పాఠశాల గ్రంథాలయానికి పంపించిన పుస్తకాలను హెచ్ఎం కె.రమేష్, టీచర్లు అందుకున్నారు. హెచ్ఎం మాట్లాడుతూ లైబ్రరీకి కథలు, జీకే, గణితం, జీవిత చరిత్రలు, సైన్స్, సోషల్ తదితర పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీన్‌కుమార్, శ్రీనికాంత్, టి.లక్ష్మీప్రసాద్, శ్రీనాథ్, ఎం.వసంతకుమారి, యాదగిరి, కృష్ణవేణి, జి.రవి, సర్వర్ పాషా, శ్రీదేవి, సురఖ, ఫకీర్‌దాస్, నళినీబాయి, రాధాకృష్ణ, శర్మ, ఇ.రమేష్, కె.రజిని, జ్యోతి జానకి, ఉ మారాణి, కె.రవి, పి.వెంకటేశ్వర్లు, నవ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బచ్చన్నపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బచ్చన్నపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో స్వస్తినారీ- స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళలకు పరీక్షలు జరుపుతోందన్నారు. కాన్పుకు ముందు, తర్వాత ఆరోగ్య స్థితి కంటి, దంత, క్యాన్సర్, రక్తహీనత, క్షయ తదితర వ్యాధులు, ఆరోగ్య పరమైన పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రాంతి స్వరూప్, ఉమాదేవి, ఆదిలక్ష్మి, అరుణ కుమారి, సుప్రజ, స్టెల్లా, రాములు, దీప్తి, శ్వేత పాల్గొన్నారు.

ఆలీంపూర్ చెరువు మత్తడి



బచ్చన్నపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు ఐబీ చెరువుల్లో ఒకటైన ఆలీంపూర్ చెరువు శనివారం సాయంత్రం నుంచి మత్తడి పడుతోంది. గోదావరి జలాలతో నిండిన ఈ చెరువులో 15రోజుల క్రితం వరకు చుక్కనీరు లేకుండా పోవడంతో కనీసం బతుకమ్మలు వేసుకోలేని పరిస్థితి కనిపించింది. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి నీరు చెరువులోకి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

తరిగొప్పుల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని బీజేపీ చేపడుతున్న సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్, శరత్ ఐ కేర్ ఆస్పత్రి బృందం 300మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, నాయకులు తోకల ఉమారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు దేవర ఎల్లయ్య, శశిదర్ రెడ్డి, బల్ల శ్రీనివాస్, ఎడెల్లి రాంనర్సింహా రెడ్డి, బ్రహ్మచారి, రాజు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పూజారులు

ఘనంగా వేంకటేశ్వరుడి కల్యాణం

చిలుపూర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని శనివారం కన్నులపండువగా నిర్వహించారు. దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న కుటుంబ సభ్యులతో కలిసి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల సమక్షంలో పూజారులు రవిందర్ శర్మ, రంగాచార్యులు కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకటయ్య, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్, గనగోని రమేష్, వెంకటేశ్వర్లు, పి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలి



తిమ్మంపేట ప్రధాన రహదారిపై దెబ్బతిన్న బీటీ రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

జఫర్‌గడ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రోడ్ల మరమ్మతు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నగేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం తిమ్మంపేట శివారులో పలు చోట్ల దెబ్బతిన్న ప్రధాన రహదారిని పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. నగేశ్ గౌడ్ మాట్లాడుతూ తిమ్మంపేట -స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్ నుంచి వర్ధన్నపేటకు వెళ్లే ప్రధాన బీటీ రహదారులతోపాటు గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు ధ్వంసమై ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రోడ్ల పరిస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అక్టోబరు 2వరకు రోడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని, లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోడెం అరవింద్ గౌడ్, ముస్కు స్వప్న, సంపత్ గౌడ్, భూక్య రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

జఫర్‌గడ్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తమ్మడపల్లి(జి)లో మృతి చెందిన పడిశాల ఐలయ్య మృతదేహం వద్ద జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మాజీ ఎంపీపీలు రడపాక సుదర్శన్, గాదెపాక అయోధ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు చిట్టిమల్ల కృష్ణమూర్తి, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి ప్రభాకర్, తదితరులు శనివారం నివాళలర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.

మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం ఎన్నిక

పాలకుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల రిటైర్డు ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నికైంది. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఆ సంఘం అత్యవసర సమావేశం కె.కృష్ణ సారథ్యంలో జరిగింది. అనంతరం కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షుడిగా దొంగరి సోమయ్య, అసోసియేట్ ఉపాధ్యక్షుడుగా దోకూరు రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా సింగారపు దీపక్, కోశాధికారిగా లింగంపల్లి రామస్వామి, ఉపాధ్యక్షుడుగా చాట్ల సోమయ్య, ప్రమీల, కాశీం, బాలమల్లు, సరోజన ఎన్నికయ్యారు.

పింఛన్ పెంచాలని వినతిపత్రాలు



హన్మంతాపూర్ కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న పెన్షన్‌దారులు

పాలకుర్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం బమ్మెర, గూడూరు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలను అందచేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చెరుపల్లి యాదగిరి స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేయూత పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొంకూరి ఉప్పలయ్య, దండు రాంచంద్రం, నరేష్, కొమురయ్య, ఐలయ్య, సోమనర్సయ్య, ఓమయ్య, వెంకటయ్య ఉన్నారు.

● నర్మెట: చేయూత పెన్షన్‌లను వెంటను పెంచాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ అన్నారు. పెన్షన్‌లను పెంచాలని కోరుతూ ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు పెన్షన్‌దారులతో కలిసి శనివారం మండలంలోని గ్రామ కార్యదర్శులకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా గద్దల కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పెన్షన్‌లను వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బిచ్చాల వంశీ, పిన్నింటి రవీందర్, యాట భిక్షపతి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో శ్రమదానం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పచ్చదనం, పరిశుభ్రత పట్ల పూర్తి అవగాహన పెంచుకోవాలని ఎస్‌బీఐ శివునిపల్లి బ్రాంచ్ మేనేజర్ గుగులోతు రవీందర్ అన్నారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వేణుగోపాల్ రెడ్డి, బ్యాంకు కౌన్సిలర్‌లు నీల రాకేష్, భార్గవి తదితరులు పాల్గొన్నారు. అలాగే శివునిపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి 100 మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు గౌరిశెట్టి అనిల్, వినయ్ కుమార్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

పాలకుర్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాకేష్‌కుమార్ సౌజన్యంతో శనివారం 100 మంది విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పోతుగంటి నర్సయ్య, హెచ్ఎం చిదిరాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విజయ్‌కుమార్, విజేందర్, ఎం.శ్రీనివాస్ ఉన్నారు.

పూల జాతరకు వేళాయే..

(5వ పేజీ తరువాయి)

వాగులు, కాల్వలలో విడిచిపెడతారు. నిత్య నూతనమైన తెలంగాణ వాకిట్లో సిరులొలికించే ప్రకృతి పండుగ బతుకమ్మను తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా మహిళలు భక్తి పారవశ్యంతో జరుపుకోవడం ఆనవాయితీ.

పూల ధరలకు రెక్కలు..

ఈ మధ్య కాలంలో పలు కారణాలతో తంగేడు పువ్వుకు కరువొచ్చింది. చెలక భూముల్లో కాంక్రీటు అరణ్యాలు విస్తరించడంతో ప్రకృతికి సహజ అలంకారాలైన పూలమొక్కలు కనిపించడం లేదు. ఈసారి గునుగు పువ్వు కూడా అరుదుగా విక్రయించారు. బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో పూల దుకాణాలు అధిక సంఖ్యలో వెలిశాయి. బంతి పూలు కిలో రూ.100 చొప్పున విక్రయాలు జరుపుతుండగా కనుమరుగైన తంగేడు, గునుగు పూల నేపథ్యంలో ప్రజలు అధిక సంఖ్యలో పూలను కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో తంగేడు, గునుగు పూల కట్ట ఒక్కటి రూ.50 చొప్పున అమ్మకాలు జరిపారు. చామంతి పూలు మాత్రం కిలో రూ.400 ధర పలికారు. కొనుగోలుదారులతో పూల దుకాణాలు కిక్కిరిసి పోయాయి. మరో వైపు ఆడపడచుల రాకపోకలతో జనగామ బస్టాండు ప్రయాణికులతో కిక్కిరిసింది. రద్దీ పెరగడం ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ముస్తాబైన ఆలయాలు.. మైదానాలు..

జనగామ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట మైదానం, రంగప్ప చెరువు మైదానం, శివాలయం, బాణాపురం, బచ్చన్నపేట కొడ్వటూరు దేవాలయం, జీడికల్‌లోని కోదండరామస్వామి దేవస్థానం, చిలుపూరులోని బుగులు వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధానంగా మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు.



నర్మెట బీఓబీ వద్ద ఉన్న భద్రతలను పరిశీలిస్తున్న సీఐ

భద్రతా చర్యలు తీసుకోవాలి

నర్మెట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎంల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని నర్మెట సీఐ అబ్బయ్య సూచించారు. శనివారం మండలకేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ), డీసీసీబీ బ్యాంకుల వద్ద ఉన్న భద్రతలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, బ్యాంకుల్లో అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నర్మెట ఎస్సై నగేష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రక్తదానం

చిలుపూర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు శనివారం రక్తదానం చేశారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేపట్టనున్న సేవాపక్వాడా కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఆ పార్టీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ తదితరులు డివిజన్ కేంద్రంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ కదుగాయ రమేష్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. .

బాధితులకు పరామర్శ

జఫర్‌గడ్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి(జి)లో మృతి చెందిన తాటికాయల పోశ ఎల్లమ్మ, పడిశాల ఐలయ్య మృతదేహాలకు శనివారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు మేరుగు రమేశ్, మారపల్లి కరుణాకర్, ఉన్నారు.